క్లుప్తంగా

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్ట్ బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా స్టువార్టుపురంకు చెందిన బాలికకు వైద్య ఖర్చులకు సోమవారం రూ. 20 వేలు అందించారు. చర్మవ్యాధితో బాధపడుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున ట్రస్ట్ నిర్వాహకుడు షేక్ సర్దార్ బాషా, షహనాజ్ దంపతులు దాత ఎస్ఆర్ఐ అనిల్ పోలవరపు సహకారంతో ఆర్థికసాయం అందించారు.

దంత వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి


విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఒంగోలు రూరల్: దంత వ్యాధులు రాకుండా చిన్న వయసు నుంచే జాగ్రత్తలు పాటించాలని ప్రముఖ దంత వైద్యుడు చింతలపాటి భూషణ్ తెలిపారు. కరవది గ్రామంలోని వివేకానంద విద్యావిహార్ 25వ వార్షికోత్సవం సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వరద సాహితీ, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, డైరెక్టర్ భరద్వాజ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో గర్భకోశ వ్యాధులపై అవగాహన అవసరం


రైతులకు వివరిస్తున్న వెటర్నరీ జేడీ బేబీరాణి

చీమకుర్తి: పశువుల్లో గర్భకోశ వ్యాధులపై పశు పోషకులకు అవగాహన అవసరమని వెటర్నరీ జేడీ డాక్టర్ కె బేబీరాణి అన్నారు. మండలంలోని చంద్రపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జేడీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మేలు రకం దూడలను పొందేందుకు అనువైన సెమన్‌ను ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచామన్నారు. సకాలంలో పశువులు ఎదకు వచ్చినప్పుడు గుర్తించడం ద్వారా ఏడాదికి ఒక దూడను పొందవచ్చన్నారు. ప్రభుత్వం గోకుల మిషన్ల ద్వారా అందించే రుణ సదుపాయాలు పొందేందుకు అవసరమైన వివరాలు అందించారు. కార్యక్రమంలో డీడీ రమేష్, ఏడీ లావణ్యకుమారి, స్థానిక వెటర్నరీ డాక్టర్లు ప్రశాంతి, చిరంజీవి, ప్రతాప్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- కొత్తపట్నం పోలీస్‌స్టేషన్, మెరైన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ దామోదర్



కొత్తపట్నం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ దామోదర్

కొత్తపట్నం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారి పట్ల స్నేహపూర్వకంగా మెలిగి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కొత్తపట్నం పోలీస్‌స్టేషన్, మెరైన్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి కొత్తపట్నం పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. స్టేషన్ల పరిసరాలు, వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ల స్థితిగతులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, పరిసర ప్రాంతాలు, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులు సరిగా లేవని, సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్‌కు తీసుకుంటున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణ, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. బీచ్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా మెరైన్ సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకుని వాటి దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. బీచ్‌కు యాత్రికులు తరచూ వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని మెరైన్ సిబ్బందికి సూచించారు. ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, నేర నియంత్రణ, నేరాల నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. రాత్రి బీట్ల పనితీరును నిరంతర మానిటరింగ్ చేయాలని, అదే విధంగా చెడునడత కలిగిన వ్యక్తుల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. సిబ్బంది తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ అక్కడి పరిస్థితులపై దృష్టి సారించాలని కోరారు. ప్రజలతో ఎలా మెలగాలనే దానిపై పలు సలహాలు, సూచనలు చేశారు. పోలీసు స్టేషన్ సిబ్బందికి సంబంధించిన సమస్యలను స్వయంగా అడిగి ఎస్పీ తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి జాప్యం లేకుండా తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ఎస్పీ వెంట ఎస్సై బి.సాంబశివరావు, మెరైన్ సిబ్బంది ఉన్నారు.

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం


రంగారాయుడు చెరువు వద్ద సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణ క్రతువులో పాల్గొన్న భక్తులు


సీతారాంపురంలో ప్రత్యేక అలంకరణలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

ఒంగోలు మెట్రో: ఆషాఢ మాసం మంగళవారం సుబ్రహ్మణ్యస్వామి జన్మనక్షత్రమైన కృత్తిక నక్షత్రం రావడంతో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఒంగోలు రంగారాయుడు చెరువు వద్ద గల సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, స్థానిక సీతారాంపురం వరాల నాగేంద్రస్వామి ఆలయంలో అర్చకులు స్వామివారికి అభిషేకం, అర్చన కళ్యాణం నిర్వహించారు. రంగారాయుడు చెరువు వద్ద ఉన్న సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఉదయం ఏడు గంటలకు స్వామివారి మూలవిరాట్‌కు పలు రకాల అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.


స్వామివారి కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వరాల నాగేంద్రస్వామికి...

స్థానిక సీతారాంపురంలో వరాల నాగేంద్రస్వామి దేవస్థానంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి ఘనంగా కళ్యాణం నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు ఆలయ అర్చకులు భారతుల శ్రీనివాసశర్మ స్వామివారు, అమ్మవార్ల మూలమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పించారు. కళ్యాణ క్రతువులో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారు, అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకించారు. ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షుడు మహంకాళి శేషయ్య, కాలభైరవ ఉపాసకుడు మైనంపాటి సాయి పాల్గొన్నారు.

ఫ్లోరైడ్‌పై అప్రమత్తత అవసరం

- ఫ్లోరైడ్ నివారణ జిల్లా అధికారి డాక్టర్ అనిల్


కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి వాణి

ఒంగోలు రూరల్: ఫ్లోరైడ్‌పై అప్రమత్తత అవసరమని ఫ్లోరైడ్ నివారణ జిల్లా అధికారి డాక్టర్ అనిల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ ఫ్లోరోసిస్ ఉన్నతాధికారులు మంగళవారం మండలంలోని కరవది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని యరజర్ల, సర్వేరెడ్డిపాలెం గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్లోరోసిస్ నివారణ అధికారి అనిల్, కరవది వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.వాణి మాట్లాడుతూ ఫ్లోరోసిస్ నివారణకు ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ వారు నిర్దేశించిన స్వచ్ఛమైన నీరు లేదా ఆర్వో ప్లాంట్ నీటిని తాగాలని తెలిపారు. నిత్యం వాడుకునేందుకు, వంట చేసుకునేందుకు కాచి చల్లార్చిన నీరు వాడటం వలన ఫ్లోరోసిస్ బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ప్రతిఒక్కరూ పండ్లు, కూరగాయలు, విటమిన్ సి, కాల్షియం ఉండే ఆకుకూరలు, మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఆరోగ్య సూత్రాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెచ్‌ఈఓ కృష్ణారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ అంజిరెడ్డి, యర్రజర్ల, సర్వేరెడ్డిపాలెం వైద్య సిబ్బంది సిరి, అంజని, జయకుమారి, గౌస్ బాజీ, పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

450 మంది భక్తులకు ఉచిత వైద్య సేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చాపల వంశీకృష్ణ

కొత్తపట్నం: కొత్తపట్నంలో ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహించిన నాంచారమ్మ తల్లి బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ చాపల వంశీకృష్ణ సహకారంతో ఆరు రోజుల పాటు సాయంత్రం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తుల్లో అవసరమైన వారికి వైద్య సేవలు అందించారు. మొత్తం 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చాపల చాపల వంశీకృష్ణతో పాటు డాక్టర్ చాపల శాంతకుమారి, డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్, హాస్పిటల్ జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్‌కుమార్, వైద్య సిబ్బంది సునీత, స్వర్ణలత, నాగరాజు, నాగండ్ల చిరంజీవి, శ్రీరామ్ బాల సంస్కార కేంద్రాల కోఆర్డినేటర్ చాపల వినుకొండయ్య తదితరులు పాల్గొని సేవలందించారు.

అలరించిన వామన అవతారం ప్రవచనం


వామన పురాణం గురించి వివరిస్తున్న రమేష్‌కృష్ణ

ఒంగోలు మెట్రో: పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక వీఐపీ రోడ్డులోని కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్న భాగవత సప్తాహ ప్రవచనంలో భాగంగా మంగళవారం నాలుగోరోజు సాయంత్రం ఏడు గంటలకు వామన అవతారం ఘట్టాన్ని శ్రీరామచంద్రుని రమేష్‌కృష్ణ వివరించారు. జిల్లాశాఖ అధ్యక్షుడు మాగంటి శ్రీరామమూర్తి అధ్యక్షత వహించగా, సంస్థ జాతీయ అధ్యక్షుడు చదలవాడ లక్ష్మీనరసింహారావు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. కార్యదర్శి పింగళి పూర్ణచంద్రరావు సభా నిర్వహణ చేయగా, కార్యవర్గ సభ్యులు అనఘా వేంకటసుబ్బారావు, పింగళిరామ మోహనరావు, పింగళి శ్రీనివాసరావు, రావినూతల వరలక్ష్మి పర్యవేక్షించారు.

ప్రభుత్వంతో పాటు అన్నీ మావే!



పెద్దారవీడు మండల ప్రజా పరిషత్ కార్యాలయం

పెద్దారవీడు:

రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో మండల పరిధిలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, పాఠశాలలో మధ్యాహ్నం భోజనం కార్మికులు, రేషన్ షాపులు మార్చాలంటూ తీవ్ర ఒత్తిడి ప్రారంభమైంది. ఇప్పటికే గ్రామాల్లో రేషన్ షాపులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న ఏజెన్సీలు నాకంటే నాకు అని ఆశావహులు ముందుకొస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే మండలంలో 19 పంచాయతీల్లో చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, రేషన్ షాపులు, మధ్యాహ్న ఏజెన్సీలను తొలగించి టీడీపీ సానుభూతిపరులకు అవకాశం కల్పించాలని అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో రేషన్ డీలర్లచే రాజీనామాలు చేయించి రెవెన్యూ అధికారులు టీడీపీ నాయకులకు డీలర్ షాపులు ఇచ్చారు. టీడీపీ సానుభూతిపరులు ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులు, మధ్యాహ్న ఏజెన్సీల కోసం పెద్ద సంఖ్యలో ఆశావహులు ముందుకొస్తున్నారు. దీంతో గ్రామాల్లో వీటిపై పోటీ తీవ్రంగా ఉండటంతో ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై టీడీపీ మండల, గ్రామ స్థాయి నాయకులకు తలనొప్పిగా మారిందని చర్చ సాగుతోంది. రేషన్ షాపులు, ఫీల్డ్ అసిస్టెంట్ల మార్పులపై టీడీపీ నాయకుల కంటే తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నాయకులు ఏది చెప్పినా కాదనకుండా చకచకా సంతకాలు పెట్టడంతో పాటు భజనపరులుగా మారిన మండల స్థాయి అధికారులు అండగా ఉంటున్నారు. గ్రామాల్లో రేషన్ షాపు డీలర్లు, పాఠశాలలో మధ్యాహ్నం భోజనం కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లపై ప్రజల నుంచి ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు లేవు. ఈ ప్రభుత్వం మాది.. ఇక్కడ మావాళ్లే పని చేస్తారు.. రాజీనామాలు చేయాలని దౌర్జన్యాలకు తెరదీశారు. మండల పరిధిలో 19 మంది ఫీల్డ్ అసిస్టెంట్లచే రాజీనామాలు చేయించాలని, వారికి రావాలసిన జీతాలు కూడా ఇచ్చేది లేదని చెప్పాలని టీఏలను ఎంపీడీఓ ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఇప్పటికి మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లపై ఎంపీడీఓ తీవ్రస్థాయిలో ఒత్తిడి తెవడంతో పలు పంచాయతీలకు చెందిన ఏడుగురు రాజీనామాలు చేశారు. టీడీపీ నియోజకవర్గ నాయకుడు ప్రతి రోజు ఫోన్ చేసి ఫీల్డ్ అసిస్టెంట్లచే రాజీనామాలు చేయించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ మంగళవారం ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌ను పిలిపించి ఆ విషయం చెప్పారు. మండలంలో 58 ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం కార్మికులు ఉండగా దాదాపు మండలంలో 15 మంది కార్మికులచే రాజీనామాలు చేశారని సమాచారం. ఇంకా ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్మికులు రాజీనామాలు చేయని వారిపై ఎంపీడీఓ, ఎంఈఓలు ఒత్తిడి చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ షాపులపై వాలిన పచ్చ గద్దలు

- బలవంతపు రాజీనామాలు చేయించడంలో అధికారులు సక్సెస్
- రేషన్ బియ్యం దోపిడీకి తెరలేపిన టీడీపీ నాయకులు


వై.పాలెంలోని పౌరసరఫరాల గోడౌన్

యర్రగొండపాలెం: రేషన్ షాపులపై పచ్చ గద్దలు వాలాయి. డీలర్ల ముసుగులో రేషన్ బియ్యం మెక్కేయటానికి ఆ గద్దలు సిద్ధమయ్యాయి. ఆగస్టు 1వ తేదీ నుంచి టీడీపీ వర్గీయులు నియోజకవర్గంలోని రేషన్ షాపులను నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు ఉన్న రేషన్ షాపు డీలర్లను తొలగించి నియోజకవర్గ టీడీపీ నాయకుడి వద్ద మెప్పు పొందడంలో రెవెన్యూ అధికారులు సఫలం అయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి టీడీపీ నాయకులు రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేసుకునేందుకు వారు మండలానికి ఒక కూటమిగా ఏర్పడ్డారు. రేషన్ షాపులకు చేరిన బియ్యం నేరుగా ఆ పార్టీకి చెందిన నాయకుడి ఆదేశాల మేరకు సరఫరా చేయాల్సి ఉంది. ఆ నిబంధనతోనే కొత్తగా డీలర్ల నియామకం జరిగిందని ఆరోపణలు వినవస్తున్నాయి. గత నెలలో త్రిపురాంతకం, యర్రగొండపాలెం మండలాల్లో అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టుకున్నారు. వచ్చే నెలలో అటువంటి పరిస్థితి లేకుండా సజావుగా రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేసుకునేందుకు అధికారులు పచ్చజెండా ఊపారు. నేరుగా సివిల్ సప్లయి గోడౌన్ నుంచే బియ్యం రవాణా చేసుకునేందుకు పచ్చ నాయకులు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలో మొత్తం 173 రేషన్ షాపు డీలర్లు ఉండగా వారిలో 37 మంది పర్మినెంట్ డీలర్లు ఉన్నారు. మిగిలిన 136 మంది తాత్కాలిక డీలర్ల నుంచి బలవంతంగా రాజీనామాలు చేయించి వారిని తొలగించారు. వచ్చే నెల నుంచి రేషన్ పంపిణీ చేసేందుకు టీడీపీ వర్గీయులకు చెందిన వారిని నియమించారు. పర్మినెంట్ డీలర్లు రాజీనామాలు చేయక పోవడంతో వారిని ఏదో ఒక విధంగా వేధింపులకు గురిచేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. నియోజకవర్గంలో మొత్తం 84,403 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటికి 11,96,219 కిలోల బియ్యం, 84,403 కిలోల కందిపప్పు, 42,202 కిలోల పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. అందులో బియ్యం మాత్రమే పంపిణీ చేసేందుకు రేషన్ షాపులకు నిల్వలు సిద్ధం చేశారు. ఈ సారికూడా పంచదార, కందిపప్పు పేదలకు పంపిణీ చేయకుండా కూటమి ప్రభుత్వం ఎగనామం పెట్టనుంది.

చట్టాన్ని అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తాం

దొనకొండ: పురుగు మందులు, విత్తనాలు విక్రయించే దుకాణ యజమానులు చట్టాన్ని అతిక్రమిస్తే వెంటనే లైసెన్స్ రద్దు చేస్తామని జిల్లా అంతర్గత తనిఖీ అధికారి, యర్రగొండపాలెం సహాయ వ్యవసాయ సంచాలకులు కె.నీరజ హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం దొనకొండలోని నాలుగు దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని పురుగుమందులు, విత్తనాలను అమ్మరాదని, రైతు కొనుగోలు చేసిన విత్తనాల ప్యాకెట్‌కు రైతులు అడిగినా అడగక పోయినా తప్పని సరిగా రశీదు ఇవ్వాలని ఆదేశించారు. ముందుగా ఆమె స్టాక్ రిజిస్టర్‌ను, బిల్ పుస్తకాలను, కంపెనీ అనుమతి పత్రాలను తనిఖీ చేశారు. గోడౌన్‌లోని విత్తన ప్యాకెట్లకు స్టాక్ బుక్‌లో ఉన్న వివరాలను సరి చూశారు. కల్తీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే అటువంటి వారిపై డీలర్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు కూడా తక్కువ ధరకు వస్తున్నాయని గ్రామాల్లో రాత్రి వేళల్లో అమ్మే వారి దగ్గర కొనకూడదని తెలిపారు. రైతులు ఈ విషయాలను గమనించి తమకు ఇబ్బందులు చేసిన డీలర్లను తెలియజేస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి ఎన్.లక్ష్మీనారాయణ, సిబ్బంది విన్నీబాబు, రవితేజ పాల్గొన్నారు.


విత్తనాల ప్యాకెట్‌ను తనిఖీ చేస్తున్న నీరజ